# అనుభవం

యామిని ఓ చిన్నతరహా రచయిత్రి. ఇరవై కథలుదాకా యిప్పటివరకూ ఓ మోస్తరు పత్రికల్లో వచ్చాయి. దాంతో యామినికి నేనూ ఓ రచయిత్రినయ్యానన్న ఆనందంతోపాటు, కొద్దిగా గర్వం కూడా వచ్చింది. పత్రికలో కథ ప్రచురితమవగానే, ఇరుగూ పొరుగుకే కాకుండా, స్నేహితురాళ్ళకి చూపించి, చుట్టాలకి ఉత్తరాలు రాసి, ఆ పత్రికపేరు, తారీకూ, నెలా, కథ పేరూ, పేజీ నెంబరూ రాసి కొని చదవమనీ, ఎలాగుందో రాయమనీ రాసేది. వాళ్ళల్లో కొందరు కథ బాగుందని జవాబు రాయగానే ఆ ఉత్తరాలని చూసుకుని ఆనందం పట్టలేక ఓ ఫైల్లో దాచి అందరికీ చూపించేది. దాంతో మరి కాస్త ఉత్సాహం పెరిగి మరిన్ని కథలు రాయడానికి ప్రయత్నించేది.

.ఆమె కథలు చదివిన కొందరు మిత్రురాళ్ళు యామినితో "ఏమండీ యామిని గారూ! పత్రికల్లో యిరవై కథలు వచ్చాయి కదా! మీదో పుస్తకంగా అచ్చువేయించుకోవచ్చు కదా! ఆ పుస్తకం ఏ ప్రయిజు కాంపిటీషన్‌కో పంపిస్తే ప్రయిజు రావచ్చు కదా!" అని అనగానే "అరే - నాకీ ఆలోచన ఇంతదాకా రాలేదేమిటీ?" అనుకుని "నిజమేనండీ నాకూ తోచనేలేదూ" అని మర్నాడే ఓ ప్రెస్‌కి వెళ్ళి తన కథల గురించి చెప్పి ప్రింటింగ్ ఛార్జీ వగైరాలు తెలుసుకుని వచ్చింది. ఇలా నాలుగైదు ప్రెస్‌ల వాళ్ళతో మాట్లాడి వచ్చి, ఇంట్లో భర్తకి చెప్పింది. కౌశిక్ యామిని చెప్పేదంతా విని "యామినీ! నీకేమన్నా పిచ్చి పట్టిందా? పాతిక కథలన్నా ప్రింట్ చేయిస్తే బాగుంటుంది. అయినా ఊరూ, పేరూ లేని నీలాంటి వారి కథలు ఏ డిస్ట్రిబ్యూటర్లు తీసుకుంటారు? నీ డబ్బుతో వేయిస్తావు సరే - అవి అమ్ముడవ్వాలి కదా! అవన్నీ ఇంట్లో పెట్టుకుని అమ్ముకుంటావా? అదంతా ఓ పెద్ద తతంగం. నేనలాంటివి పడలేను" అని అంటూ ఆమె ఉత్సాహం మీద నీళ్ళు చిలకరించాడు. చిన్న ముఖం చేసుకున్న యామిని ఏమీ అనకుండా అక్కడనుంచి వచ్చేసింది.

లోపలి కొచ్చిందే గాని బుర్రలోంచి ఆలోచనల్ని మాత్రం తొలగించలేక పోయింది. మళ్ళీ మర్నాడు స్నేహితుల్ని కొందర్ని డిస్ట్రిబ్యూటర్ల గురించి అడిగింది. వాళ్ళు ఇదివరలో కథల పుస్తకాలు అచ్చు వేయించిన వారిని అడగమని సలహా యిచ్చారు. దాంతో కొందరు రచయిత్రుల టెలిఫోన్ నెంబర్లు సంపాదించి వారిని అడిగింది. వారిలో చాలా మంది "అబ్బే! మా కథలంటే డిస్ట్రిబ్యూటర్లు మాకివ్వండంటే మాకివ్వండని పుచ్చేసుకున్నారు. మాకేం యిబ్బంది కలగలేదండీ! పేరున్న రచయిత్రులం కదా!" అని గొప్పగా గర్వంగా చెప్పసాగారు.

ఆ మాటలతో వాళ్ళంతా తన్నో చిన్న రచయిత్రిగా చూస్తున్నారన్న కోపం ఉక్రోషం వచ్చి, "ఛీ, ఛీ - ఇలాంటి వారికి ఫోన్లు చెయ్యడం నాదే తప్పు" అనుకుని ఇంకెవరికీ ఫోన్లు చెయ్యలేదు.

ఆలోచించి, ఆలోచించి తన సొంత డబ్బుతో ప్రింట్ చేయించుకోవాలని నిశ్చయించుకుంది. అయిదువందల కాపీలకి యిరవై వేలదాకా అవుతుంది అని లెక్కచెప్పారు. డిస్ట్రిబ్యూషన్ మాత్రం వాళ్ళు తీసుకోమని చెప్పగానే ఆలోచించి, కొన్ని కాకపోతే కొన్నయినా అమ్ముడు కాకపోతాయా? అని అనుకుని తన డబ్బుతో ఆ ఇరవై కథలు ప్రింట్ చేయించుకోడానికి సిద్ధపడింది. డబ్బు భర్తనడగాలి. మంచి మూడ్‌లో వుండగా పని పూర్తి చేసుకోవాలని ఎదురుచూడసాగింది. భర్త అమ్మకం గురించి అడిగితే తనకి మంచి మంచి స్నేహితురాళ్ళున్నారనీ వారికి తలో పదేసి యిచ్చి అమ్మించేస్తానని చెప్పాలనీ నిశ్చయించుకుంది. అంతే కాకుండా తనకున్న స్నేహితురాళ్ళు, చుట్టాలనీ లెక్కపెట్టుకుని, లిస్టు రాసుకుంది. అంతా తలో పదేసి అమ్మినా నాకు లాభమే అనుకుని ఎందో ఆనందపడింది. ఓ సారి చూచాయగా భర్తతో అవే మాటలు అంది. కౌశిక్ వినీ విననట్లు వూరుకున్నాడు.

తన ఆలోచనల్ని ఓ పక్కని పెట్టి మోగుతున్న ఫోన్ అందుకోవడానికి లేచి వెళ్ళింది యామిని. "హలో ఎవరూ?" అన్నదానికి "నేను మంజీరని యామినీ" అంటూ అవతలి కంఠం అనగానే - "హేయ్ మంజీరా! ఇప్పుడు పది నిమిషాలు కూడా కాలేదు. నిన్ను తల్చుకుని" అని అనగానే "సరేగానీ మీ యింటికొస్తున్నాను. ఇంట్లోనే వుంటావా?" అనగానే "రా, రా, ఇంట్లోనే వున్నాను" అని ఫోన్ పెట్టేసి, మంజీర రాక కోసం ఎదురు చూడసాగింది యామిని. మంజీర, తనూ చిన్నప్పటి స్నేహితులు. మంజీరతో తన కథల గురించి చెప్పి, అన్ని విషయాలూ వివరంగా చర్చించవచ్చు కదా అని ఆనందపడసాగింది.

మరికొంతసేపటికి మంజీర రానే వచ్చింది. భుజానికి ఓ పెద్ద బేగ్ తగుల్చుకుని లోపలికి రాగానే బల్లమీద ఆ బేగ్‌ని దింపి "అమ్మయ్య" అనుకుని ముఖానికి పట్టిన చెమట రుమాలుతో తుడుచుకుని యామిని యిచ్చిన మంచి నీళ్ళు త్రాగి కుర్చీలో కూర్చుంది.

ఓ పదినిమిషాల తరువాత యామిని యిచ్చిన కాఫీ తాగుతూ "యామినీ! నాకో చిన్న సహాయం చెయ్యాలోయ్" అంది యామినిని చూస్తూ.

"చెప్పవోయ్, చెయ్యగలిగిన సహాయం తప్పకుండా చేస్తాను" అంది. మనసులో నేనివాళ చేస్తే రేపు నేనూ మంజీర ద్వారా కొన్ని పుస్తకాలు అమ్మించుకోవచ్చు" అని ఆనందిస్తూ.

యామిని మాటలకి థ్యాంక్స్ చెప్తూ భుజాన్నేసుకొచ్చిన బ్యాగ్ తెరిచి అందులోంచి ఓ పాతిక ఆడియో కేసెట్లు యామినికి ఇస్తూ "యామినీ! ఈ కేసెట్లు నా పాటలవి. ఆమధ్య నేను ఓ ఫ్రెండ్ ఇంట్లో పాట పాడితే మంచి కంఠం మీ పాటలది ఓ కేసెట్ ఇవ్వకూడదూ! అన్నారు. దాంతో కొన్ని లలిత గీతాలు మా ఫ్రెండ్ చేత రాయించి, ట్యూన్ కట్టించి, స్టూడియోలో రికార్డు చేయించానోయ్! చాలా డబ్బయింది. నీలాంటి స్నేహితురాళ్ళందరికీ తలో పాతికా యిచ్చి

వాళ్ళ వాళ్ళ స్నేహితులకి ఇవ్వమంటున్నానోయ్! నీకూ ఓ పాతిక కేసెట్లు ఇస్తాను. ఒక్కోటి ముప్పై రూపాయల చొప్పున అమ్మి పెట్టు" అంటూ బల్ల మీద పెట్టగానే "ఓ అదెంత పనీ, తప్పకుండా అలాగే అమ్మి పెడతానోయ్! మరో అయిదు కేసెట్లు కూడా ఇవ్వు"అంటూ మొత్తం ముప్పై కేసెట్లు తీసుకుంది. నేనివాళ ఓ ముప్పై కేసెట్లు అమ్మి పెడితే రేపు మంజీర చేత నలభై పుస్తకాలదాకా తన ప్రింటు చేయించుకోబోయేవి ఇచ్చి అమ్మించుకోవచ్చు కదా అన్న ఆశతో! కానీ యిప్పుడే ఆ విషయాలు చెప్పడం బాగుండదని ఏమీ అనలేదు.

నిజమైన కష్టాలు యామినికి ఇప్పుడే ప్రారంభమయ్యాయని చెప్పొచ్చు. యామిని దగ్గర మంజీర పాటల కేసెట్‌లు, బాగా మొహమాటస్తులయిన ఓ ఇద్దరు, ముగ్గురు మాత్రం తీసుకుని మిగిలిన స్నేహితులు క్వాలిటీ బాగాలేదనీ, రికార్డింగ్ బాగాలేదనీ, పాడినావిడ కంఠం బాగాలేదనో, పాటలు బాగా లేవనీలాంటి వంకలెడుతూ తీసుకెళ్ళిన కేసెట్లు, పదిహేను, యిరవై రోజుల తరవాత ఇంటికొచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయారు. తరవాత డబ్బులిస్తామన్న వాళ్ళు డబ్బులకి బదులు కేసెట్టే ఇంట్లో పెట్టేసి వెళ్ళడంతో ఏమీ అనలేక తెల్లబోయి ఆ కేసెట్లు మళ్ళీ లోపల పెట్టుకుంది యామిని.

ఇలా చాలా మందిని ఆ కేసెట్ల గురించి అడిగి, అడిగి ఎవ్వరూ తీసుకోకపోవడంతో పాటు, కొందరు "యామినీ! ఇంతలా అడుగుతున్నావు. నీకిందులో కమీషన్ ఎంత?" అని అడగ్గానే షాక్ కొట్టినట్లయింది యామినికి. ఇంతవరకూ ఎవరి మనసుల్లోనూ ఇలాంటి ఆలోచనలు వున్నాయని కూడా అనిపించక పోవడంతో కాస్త బాధ కూడా కలిగింది. దాంతో ఏదో తప్పు చేసిన దానిలా బాధపడసాగింది. దానికి తోడు మంజీర తరచూ ఫోన్లు చేసి "ఎన్ని కేసెట్లు అమ్మేవోయ్!" అని అడగ్గానే కేసెట్లిచ్చిన కొత్తల్లో స్నేహితురాళ్ళు తీసుకెళ్ళిన కేసెట్ల లిస్టు గొప్పగా చెప్పి "ఓ ఇరవైదాకా అమ్ముడయ్యాయోయ్!" అని చెప్పడంతో చాలా ఆనందపడిపోతూ యామినిని తెగ పొగిడింది.

ఓ రోజు యామినికి ఫోన్ చేసి "యామినీ! నేను కొంచెం పని మీద వూరికెళ్తున్నాను. డబ్బులు కావాలోయ్! నెమ్మదిగా మిగతా కేసెట్లు అమ్ముడయిపోయాకా ఆ డబ్బుకూడా తీసుకుందువుగాని నాకు మొత్తం కేసెట్ల డబ్బు యివ్వవా? చాలా అవసరం వచ్చి అడుగుతున్నాను" అని అనగానే ఏమీ అనలేక, స్నేహితురాళ్ళింకా డబ్బు యివ్వలేదని చెప్పలేక, మంజీరకి ఇంట్లో భర్తవుంచిన డబ్బు తీసుకెళ్ళి యిచ్చింది. ఆ తరవాత ఇద్దరు, ముగ్గురు తప్ప మిగిలిన వాళ్ళంతా కేసెట్లు తిరిగి తెచ్చి ఇవ్వడంతో యామినికి మతిపోయినట్లయింది. ఇంట్లో వున్న కేసెట్లు ఏం చెయ్యాలో తెలీటం లేదు. "మంజీరకి తన కేసెట్ డబ్బులన్నీ అందాయి. నష్టమల్లా తనకే!" అనుకుంటూ బాధపడసాగింది. ఇంట్లో ఏదన్నా ఖర్చు వస్తే వుంటుందని బ్యాంక్ నుంచి తెచ్చిపెట్టిన డబ్బుల్లోంచి మంజీరకి యివ్వవలసింది యిచ్చేసింది. రేపు భర్త అడిగితే ఏం చెప్పాలా డబ్బు గురించి అన్న ఆలోచనలతో పిచ్చిగా వుంది యామినికి. తమది మధ్య తరగతి కుటుంబం, అందుకే తను ఓ ఇరవై వేలు ఖర్చు చేసి కథల పుస్తకం అచ్చు వేయించాలని వున్నా ఆచరణలోకి పెట్టలేకుండా వుంది.

ఇంక దాచడం లాభంలేదనుకున్న యామిని సాయంకాలం భర్త ఇంటికి వచ్చాక మంజీర కేసెట్ల కథంతా కౌశిక్‌తో చెప్పింది. అంతే కాకుండా తను యామినికి ఇంట్లో భర్త దాచిన డబ్బు ఇచ్చినట్లు కూడా చెప్పి క్షమార్పణ అడగసాగింది. అంతా విన్న కౌశిక్ "యామినీ! నీకో తమాషా చూపించనా?" అంటూ తన బ్రీఫ్‌కేస్ తెరిచి ఓ కేసెట్ తీశాడు. దానిపై లేబిల్ చదివి తెల్లబోయింది. అది తనకి మంజీర యిచ్చిన కేసెట్ "తమాషా చూపిస్తానంటూ మంజీర కేసెట్ చూపిస్తున్నాడేమిటి?" అనుకుని "మీ బ్రీఫ్‌కేస్‌లోకిదెలా వచ్చింది?" అని అడగ్గానే కౌశిక్ ఆ కేసెట్ తీసి టేప్ రికార్డర్‌లో పెట్టాడు. అందులో మంజీర పాటలకి బదులు ఎవరిదో కొత్త గొంతు పాడిన పాటలు వినిపిస్తున్నాయి. ఆశ్చర్యంతో షాకయి వినసాగింది. కేసెట్ పూర్తయ్యాక రికార్డర్ ఆపి, "యామినీ! విన్నావా? చూడు నీ దగ్గర మొహమాటంకొద్దీ కేసెట్‌లు తీసుకున్నవాళ్ళు కూడా వాళ్ళకా పాటలు నచ్చక, ఆ కేసెట్‌ల మీదే మరొకరి పాటలు రికార్డు చేసుకున్నారు.

మొన్న మా స్నేహితుండింటికి వెళ్తే ఆయనింట్లో ఈ టేప్‌లో పాటలు వినిపిస్తున్నాయి. "పాటలు బాగున్నాయి ఎక్కడదీ కేసెట్?" అని అడిగితే "రేడియోనించి రికార్డు చేశామని. నువ్వు తీసుకెళ్ళి టేప్ చేసుకుని యిమ్మని" కేసెట్ యిచ్చాడు. అతనికి వాళ్ళావిడ ఈ కేసెట్ నీ దగ్గరే కొన్నట్లు తెలీక ఆ కేసెట్ నాకిచ్చివుంటాడు. నీకోసారి చూపించి ఈ కథ చెబుదామని ఆ కేసెట్ తీసుకొచ్చాను. ఇంతలో నువ్వు నీ తరఫున కథ చెప్పావు. నీ దగ్గర కేసెట్లు కొన్న మొహమాటస్తులు కొందరు ఇలా ఉపయోగిస్తే, నిర్మొహమాటస్తులు నీకు తిరిగి కేసెట్లు యిచ్చేశారు. ఇప్పుడన్నా తెలిసిందా? మిడిమిడి విద్యలతో మనం చేసే కొన్ని పన్ల పర్యవసానం! మిడిమిడి జ్ఞానంతో ఏ పనన్నా చేసేకన్నా పరిపూర్ణత చెందాక చెయ్యడం మంచిదని అర్థమయిందా యామినీ! నీ కథల గురించి ఆ రోజు నీతో ఎందుకలా చెప్పానో!? నువ్వు నీ స్నేహితులంతా సహాయం చేస్తారన్నావు. స్నేహితురాళ్ళంతా నీలాగుండరు. నిర్మొహమాటంగా కేసెట్లు తిరిగిచ్చినట్లే, కథల పుస్తకాలు కూడా చదివేసి తిరిగిచ్చేస్తారు. ఇవన్నీ ఆలోచించే ఆ రోజు వద్దన్నాను. నువ్వు మరి కొన్ని కథలు వ్రాసి, మంచి పేరు తెచ్చుకుని, మంచి డిస్ట్రిబ్యూటర్లని చూసి కథలు అచ్చు వేయించుకో! అంతేగానీ ఎవరో చెప్పారని నమ్మి, స్నేహితురాళ్ళని వేధించి బాధపెట్టకు. పోతే పోయాయి ఆ కేసెట్ల డబ్బులు. ఎవరి దగ్గరన్నా మంచి పాటలు తెచ్చుకుని మంజీర ఇచ్చిన కేసెట్లు మీద రికార్డు చేసుకుని, ఖాళీ కేసెట్లు కొనుక్కుని మంచి పాటలు రికార్డు చేసుకున్నాననుకుని, విని ఆనందించు" అంటూ ఆమె బాధని దూరం చేశాడు కౌశిక్. ఇంతదాకా భర్త ఏమంటాడో అని బెదిరిపోతున్న యామిని మనసు తేలికయి "సారీ అండీ! మీ సలహాకి చాలా చాలా థ్యాంక్సండీ! నేను మంజీరలా చెయ్యను. మొదట్లో మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను" అంటూ లేచింది తేలికయిన మనసుతో యామిని.

**- ప్రియదత్త, 24-11-2004**